క్లుప్తంగా

అధినేతను కలిసిన రాకేష్‌రెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో రాకేష్‌రెడ్డి

పలమనేరు : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో పార్టీ పలమనేరు మాజీ కో–ఆర్డినేటర్, సినీ నిర్మాత రాకేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పలమనేరులో రాజకీయ పరిస్థితులు, కార్యకర్తల ఇబ్బందులు, పార్టీ బలోపేతంపై చర్చించినట్లు వెల్లడించారు.

13న పుంగనూరులో చెస్ పోటీలు

పుంగనూరు : పట్టణంలోని లయన్స్ క్లబ్, గురుకులం చెస్ క్లబ్ సంయుక్తంగా ఈనెల 13వ తేదీన ఉదయం 9 గంటల నుంచి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ మణికంఠ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈస్ట్‌పేట మున్సిపల్ హైస్కూల్‌లో పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ టోర్నీ విజేతలను ఈనెల 18వ తేదీన నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 9581432310 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పలమనేరు ఎస్‌ఐగా వెంకట నరసింహులు



పలమనేరు : పలమనేరు ఎస్‌ఐగా వెంకట నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న శివశంకర్ సోమలకు బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ వెంకట నరసింహులు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసేవారిపై ప్రత్యేక దృష్టిని సారిస్తామని తెలిపారు.

మత్స్యకారుల సమావేశం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో బుధవారం మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. సంఘం నేత కృష్ణమూర్తి మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెరువుల ఆక్రమణలను అడ్డుకోవాలని, బెస్త కులస్తులకు సామాజిక భద్రత కల్పించాలని, బోగస్ సర్టిఫికెట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విత్తనశుద్ధి ఉపయోగకరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న

రొంపిచెర్ల: వ్యవసాయంలో విత్తనశుద్ధి ఉపయోగకరమని, జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీ ప్రసన్న తెలిపారు. బుధవారం మండలంలోని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. అలాగే సాగుకు ముందు భూసార పరీక్ష చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువుల వాడకంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్‌బీకేలలో విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు వెంకటరమణ నాయక్, సుబ్రమణ్యం, సుజాత, నర్మద, నరసింహులు, శ్రావణి పాల్గొన్నారు.

కాణిపాకంలో నిత్యాన్నదానానికి విరాళం



నగదు అందిస్తున్న దాత కుటుంబసభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం ఓ దాత నగదు విరాళం అందజేశారు. తవణంపల్లి మండలం కొండరాజువ కాలువ గ్రామానికి చెందిన దాత దినకరనాయుడు ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి, విగ్నేష్ పాల్గొన్నారు.

అమెరికా నుంచి తెప్పించిన మేకలు



పొదిగించేందుకు సిద్ధంగా నాటు కోడి గుడ్లు



కోళ్ల పెంపకానికి వేసిన షెడ్లు



వ్యవసాయ క్షేత్రంలో పెరుగుతున్న పావురాలు



ఆదర్శంగా 'సాగు'తూ.. ఆదాయం సాధిస్తూ..!

ఉన్నత విద్యను అభ్యసించినా వ్యవసాయంపై మక్కువ తగ్గలేదు.. విదేశాల్లో ఉద్యోగం చేసినా ప్రకృతి సేద్యంపై ఆసక్తి పోలేదు.. సేంద్రియ సాగును కొత్త పుంతలు తొక్కించాలనే ఆలోచనతో ఇక్బాల్ అలియాస్ బాబు 14 ఏళ్ల క్రితం కుప్పం మండలం గుడ్లనాయన పల్లెకు చేరుకున్నారు. 12 ఎకరాలను కొనుగోలు చేసి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దుకున్నారు. సమగ్ర విధానాలతో వివిధ రకాల పంటల సాగు చేపట్టారు. వినూత్న పద్ధతులను అవలంభిస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. తోటి రైతులకు సైతం అమూల్యమైన సలహాలు అందిస్తూ వారికి దిశానిర్దేశం చేస్తున్నారు.



బాబు తోటలో పనస చెట్టు

- గుడ్లనాయపల్లెలో ఓ రైతు వినూత్న వ్యవసాయం
- 12 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సమగ్ర సేంద్రియ సేద్యం
- వివిధ పంటలతో సిరులు కురిపిస్తున్న వ్యవసాయ క్షేత్రం
- అన్నదాత ఇక్బాల్ అలియాస్ బాబుపై ప్రత్యేక కథనం

కుప్పం రూరల్ : చెన్నైకు చెందిన ఇక్బాల్ అలియాస్ డాక్టర్ బాబు అనే రైతు 14 ఏళ్ల క్రితం కుప్పం మండలం గుడ్లనాయనపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. ఆయన కోయంబత్తూరులో పుట్టి పెరిగి చెన్నైలో ఇంజినీరింగ్ అభ్యసించారు. ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ డిజైనింగ్, సేఫ్టీ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తర్వాత పదేళ్లపాటు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేశారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త బిల్ మోలీసన్, జపాన్ శాస్త్రవేత్త మోసానో ఫుకుకో వ్యవసాయ విధానాలపై ఆకర్షితులయ్యారు. వారిని ఆదర్శంగా తీసుకుని సమగ్ర ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని నిర్ణయించుకున్నారు. మదిలో ఆలోచన రావడంతోనే తెలిసిన పరిచయాలతో 2010లో కుప్పం మండలం, గుడ్లనాయనపల్లె వద్ద 12 ఎకరాలను కొనుగోలు చేశారు. గుట్టలతో కలిసి ఉన్న ఆ భూమిని సుమారు రూ.80 లక్షలు వెచ్చించి వ్యవసాయ క్షేత్రంగా మార్చుకున్నాడు.

కోళ్లు, గొర్రెలు, పావురాలతో..

బాబు తన వ్యవసాయ క్షేత్రంలో కోళ్లు, గొర్రెలు, పావురాలను పెంచుతున్నారు. ముఖ్యంగా కోళ్లను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని పెంచడం ద్వారా అవి మూడు నెలల్లోనే అధిక బరువుకు చేరుతున్నాయి. దీంతో ఒక్కో కోడిని రూ.600 నుంచి రూ.700లకు విక్రయిస్తున్నారు. అలాగే బాబు పర్యవేక్షణలో పెరుగుతున్న పావురాలకు తమిళనాడులో మంచి గిరాకీ ఏర్పడింది. జత పావురాలు రూ.2వేలకు పైగానే అమ్ముడవుతున్నాయి. ఇక్కడి పావురాలకు ఓ ప్రత్యేకత ఉంది. వాటిని ఎక్కడ విడిచిపెట్టినా సాయంత్రాని కల్లా క్షేత్రానికి చేరుకుంటాయి. ఇక్కడే 50 గొర్రెలను సైతం పెంచుతున్నారు. ఒక్కో గొర్రెను రూ. 6 వేలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే వ్యవసాయ క్షేత్రంలోని నీటి కుంటల్లో పెరిగిన చేపలను ఉచితంగా స్థానికులు పంచిపెడుతుండడం విశేషం.

40 రకాల చెట్లు

బాబు తన క్షేత్రంలో 40 రకాల చెట్లు ఉన్నాయి. వీటిలో ఎర్రచందనం, శ్రీగంధం, రోజ్‌వుడ్, టేకు తోపాటు మెడిసిన్ చెట్లయిన కడంబం, మరిడి, ఉడిలీ, పండ్ల రకాలైన వాటర్ ఆపిల్, బొప్పాయి, జామ, మామిడి, పనస, అల్ల నేరేడు రకాలను సాగు చేస్తున్నారు. అందులో పండ్లను స్థానికంగా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇక్కడ సాగు చేస్తున్న పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని పలు మార్కెట్‌లకు కిలో రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే సేంద్రియ విధానంలో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా వరి, రాగి, జొన్న, సజ్జ, మొక్కజొన్నను సాగు చేస్తుండడం గమనార్హం.

తోటి రైతులకు అండగా..

బాబు తన క్షేత్రంలో సాగు చేసే పంటలకు సంబంధించి తోటి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వారికి ఉచితంగా విత్తనాలు సైతం అందిస్తున్నారు. పంటల సాగులో మెలకువలను తెలియజేస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా అమెరికా మేకలు

బాబు వ్యవసాయ క్షేత్రంలో అడుగు ఎత్తు కూడా లేని మేకల జంట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బాబు స్నేహితుడు స్టీఫెన్ అనే వ్యక్తి అమెరికా నుంచి వాటిని పంపించారు. చిన్నగా కనిపించినా ఈ మేకలు పిల్లలను ఈనుతాయని బాబు వెల్లడిస్తున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల స్ఫూర్తితో..



బిల్ మోలీసన్, మోసానో వంటి వ్యవసాయ శాస్త్రవేత్తల స్ఫూర్తితో సేద్యం ప్రారంభించా. పాలేకర్ సేంద్రియ వ్యవసాయ తరగతులకు సైతం హాజరవుతుంటా. సమగ్ర ప్రకృతి సాగుపై మక్కువ ఎక్కువ. ఈ క్రమంలోనే పలు రకాల కలప, పండ్ల చెట్లు సాగు చేస్తున్నా. కోళ్లు, గొర్రెలు, పావురాలను పెంచుతున్నా. ఒకదానికి రేటు లేకపోయినా.. మరోదానిపై ఆదాయం వస్తుంది. భవిష్యత్‌లో ఇలాంటి సమగ్ర విధానాలకే మనుగడ ఉంటుంది. ఈ పద్ధతుల్లో సాగు చేసేందుకు ఎవరికైనా సలహాలు కావాలంటే ఉచితంగానే అందిస్తా. మా పొలంలో ప్రతి అడుగుకీ రూ.10 ఆదాయం వచ్చేలా లక్ష్యం నిర్దేశించుకున్నా. ఆ మేరకు ప్రయోగాలకు వెరవకుండా సేద్యం చేస్తున్నా. త్వరలోనే మా క్షేత్రంలో ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రతి శనివారం సంత ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నా.

– బాబు, రైతు, గుడ్లనాయనపల్లె, కుప్పం మండలం



విరగకాసిన అల్లనేరేడు



మెడిసిన్ చెట్లు



సాగులో ఉన్న పసుపు

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

పలమనేరు : పట్టణంలో వందపడకల ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు విన్నవించారు. బుధవారం ఈ మేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. గతంలో మంజూరైన కళాక్షేత్రం, పెద్దచెరువు సుందరీకరణ, ఆర్టీసీ డిపో అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

టీచర్లకు ముగిసిన శిక్షణ



శిమాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు బాలకృష్ణ

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారం రోజులుగా ఉపాధ్యాయులకు కొనసాగుతున్న టీచ్ టు టూల్ శిక్షణ బుధవారంతో ముగిసింది. శిక్షణ తరగతులను రాష్ట్ర పరిశీలకుడు బాలకృష్ణ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి, మాస్టర్ ట్రైనర్స్ అన్సర్, గౌస్, ధనుంజయ, తేజం నారాయణస్వామి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె : స్థానిక పీహెచ్‌సీలో మహిళలకు పోషకాహారంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చునని తెలిపారు.వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రతను పాటించాలని కోరారు. దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది లక్ష్మి, ముబీనా, రాజేశ్వరి, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

16న వాహనాల వేలం

పుంగనూరు : పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు వాహనాల వేలం చేపట్టనున్నట్లు ఇన్‌స్పెక్టర్ లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

అంగన్‌వాడీల ఆందోళన



పుంగనూరు ఐసీడీఎక్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పలమనేరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

పుంగనూరు : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అఖిల భారత కోరికల దినోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లు, ఇతర సిబ్బంది నిరసన తెలిపారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సీడీపీఓ రాజేశ్వరికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పద్మ, పుణ్యవతి, లీలావతి, లీలాకుమారి, చంద్రవతి, కల్పన, అంజలి, శోభారాణి పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఏటా కోర్కెల దినోత్సం సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలను చేపడుతామని అంగన్‌వాడీల సంఘం అధ్యక్షులు భారతి తెలిపారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేసేందుకు బడ్జెట్ పెంచాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మమ్మ, అనసూయ, ధనమ్మ, రాణి రెడ్డెమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

మెస్ చార్జీలు చెల్లించాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

పుంగనూరు : విద్యార్థులకు మెస్ చార్జీలు, వసతిగృహాలకు బిల్లులు తక్షణం చెల్లించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శుభారాం డిగ్రీ కళాశాలలో రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న జిల్లా అధ్యక్షులు గంగరాజు, సిద్ధు, నియోజకవర్గ అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఉత్తన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పరిశ్రమలు, ప్రత్యేకహోదా, మెడికల్ కళాశాలలు నిర్మాణంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకేష్, కార్యదర్శిగా సంతోష్, మహిళా విభాగంలో గంగోత్రి, ముబారక్, ఉపాధ్యక్షులుగా సునీల్ కుమార్, అజయ్‌కుమార్, తేజకుమార్, తులసీరాం, సంజయ్‌కుమార్, శ్రీకాంత్, శిరీష, జయలక్ష్మి, హేమశ్రీ, అర్చన, పూజ ఎన్నికయ్యారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు



దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు : పట్టణంలోని గంగమ్మగుడివీధి, బజారు, జవిళి, గుడియాత్తంరోడ్డు, టీకే స్ట్రీట్‌లో రోడ్డును ఆక్రమించుకున్న వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు తొలగించుకోకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి పట్టణంలో రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కాబట్టి వెంటనే దుకాణాలను తీసివేయాలని వ్యాపారులకు సూచించారు. ముఖ్యంగా శివాలయం వద్ద ఉన్న దుకాణదారులు వారపుసంతలోకి షాపులను మార్చుకోవాలని ఆదేశించారు.

పురపాలక అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు : పలమనేరు పురపాలక అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నీటి సమస్య పరిష్కారం, సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చైర్‌పర్సన్ చాముండేశ్వరి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ చూపడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కౌన్సిలర్లు మండీ సుధా, కిరణ్, కోదండరామయ్య, రహీంఖాన్, నాగరాజు, శ్యామ్, శ్యామ్‌సుందర్‌రాజ్, కుమార్, సునీత, శారద తదితరులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

అజెండాలోని అంశాలకు ఆమోదం

సమావేశ అజెండాలోని 14 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలో మంచినీటి సరఫరా, ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, అన్న క్యాంటీన్ పునరుద్ధరణ, బోర్ మోటార్ల మరమ్మతులు, దుకాణాల వేలం తదితర అంశాలను చేపట్టాలని తీర్మానించారు.

పలు సమస్యలపై చర్యలకు డిమాండ్

సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. కౌన్సిలర్ కోదండరామయ్య మాట్లాడుతూ పట్టణంలో డయేరియా ప్రబలుతోందని, నివారణపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భజలాలు అడుగంటాయని వాగుల్లో ఇసుకను తోడేయడంతో ఈ సమస్య తలెత్తిందని కౌన్సిలర్ హైదర్ ప్రస్తావించారు. అనధికారిక ట్యాప్‌లపై సర్వే చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు విన్నవించారు. గంజాయి బ్యాచ్ ఆగడాలకు చెక్ పెట్టాలని కౌన్సిలర్ కిరణ్ కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కౌండిన్య నీటిని తోడేస్తున్నారు!

- నది పొడవునా అక్రమ మోటార్లు పెట్టిన వైనం
- నిబంధనలకు విరుద్ధంగా నీటి వినియోగం
- భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం
- చర్యలు తీసుకోవాలంటున్న రైతాంగం

అందరూ అన్నదాతలే.. అయితే కొందరి అత్యాశ మరికొందరికి ఇబ్బందులు తీసుకువస్తోంది. పొలంలో బోరు ఉన్నా.. అదనపు నీటి కోసం కౌండిన్య నుంచి నీరు తోడేస్తున్న వారి వల్ల ఎక్కువమంది రైతులు ఇక్కట్ల పాలవుతున్నారు. రూ.లక్షలు వెచ్చించిన బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం పొంచి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. అక్రమంగా నదిలో మోటార్లు పెట్టి తమ పంటలకు నీరు సరఫరా చేసుకుంటున్న వారిని అధికారులు కట్టడి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న వారు ఇసుకాసురులకు పరోక్షంగా సాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.



పలమనేరు మండలంలో కౌండిన్య నది నుంచి మోటారు తో నీటిని తోడేస్తున్న దృశ్యం

పలమనేరు : నియోజకవర్గంలో వర్షాలు కురిస్తే ప్రవహించే నది కేవలం కౌండిన్య మాత్రమే. గత నాలుగైదు ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో వర్షాలు బాగా పడుతున్న కారణంగా నది ప్రవహిస్తూనే ఉంది. అక్కడక్కడా నిర్మించిన ఆనకట్టల కారణంగా పలుచోట్ల నీరు నిల్వ ఉంది. అయితే కొందరు నదికి సమీపంలోని తమ పొలాలకు అక్రమంగా మోటార్లు పెట్టి నీటిని తోడేస్తున్నారు. ముఖ్యంగా చెక్‌డ్యామ్‌ల వద్ద ఈ వ్యవహారం అధికంగా సాగుతోంది. దీంతో మరో రెండు నెలల్లోనే నదిలో నీటి జాడ అదృశ్యమయ్యే ప్రమాదముంది. ఫలితంగా ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయబోర్లు ఎండిపోతాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందలాదిగా మోటార్లు

కౌండిన్య నది పెద్దపంజాణి మండలంలోంచి గంగవరం, పలమనేరు మండలాల మీదుగా దాదాపు 30 గ్రామాల సమీపంలో ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాల్లో నదికి ఆనుకొని వేలాది మంది రైతుల భూములున్నాయి. అందులో వారి సొంత బోర్లున్నాయి. ఇక నదిలో గతంలో నిర్మించిన పలు చెక్‌డ్యామ్‌ల వద్ద నీరు పుష్కలంగా ఉంది. ఈ నీటిపై కన్నేసిన కొందరు వారి పొలాలకోసం నదిలో మోటార్లు పెట్టి అక్రమంగా నీరు తోడేస్తున్నారు. నదిలో నీరు లేకుంటే పొరుగునే ఉన్న బోర్లు ఎండిపోవడం ఖాయం.ఇది పట్టించుకోని కొందరు రైతులు అక్రమంగా మోటార్లతో నీరును తమ పొలాలకు పారించుకుంటున్నారు. నదిలో నీరు తగ్గడంతో ఇసుకాసురుల కన్ను ఇక్కడ ఇసుక నిల్వలపై పడుతోంది. ఫలితంగా నదిలో నీరు, ఇసుక రెండూ తగ్గిపోతున్నాయి.

ఒకరిపై ఒకరి వంతులు!

నదిలో నీటిని ఇరిగేషన్ శాఖ పర్యవేక్షించాల్సి ఉంది. అయితే చెక్‌డ్యామ్ నిర్వహణ తప్ప మోటార్ల విషయం తమ పరిధిలో లేదని ఆ శాఖ అధికారులు తేల్చిచెబుతున్నారు. బోర్ల విషయం ట్రాన్స్‌కో వారు చూసుకోవాలని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా సంబంధితశాఖల ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కౌండిన్య పరీవాహక ప్రాంత రైతులు కోరుతున్నారు.